# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి.**

**2. ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్.**

**3. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు.**

**4. పల్నాడు జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతి.. పలువురికి గాయాలు.**

==========================

మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా విడుదల చేసిన సందేశంలో వారు స్పందిస్తూ, మొహర్రం త్యాగం, ధర్మం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే పవిత్ర పండుగ అని పేర్కొన్నారు. శాంతి, సామరస్యం, సోదరభావంతో సమాజం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

--------------------------

ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కె పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో సుమారు రెండు కోట్ల రూపాయల విలువైన 109 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో స్పందిస్తూ, ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణా 70 శాతం మేర తగ్గిందన్నారు. రాష్ట్ర సంపద అయిన ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా అంతర్రాష్ట్ర సమన్వయంతో అక్రమ రవాణా వ్యవస్థలను పూర్తిగా ఛేదించేందుకు చర్యలు మరింత వేగవంతం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

--------------------------

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా పోలీస్ ఈగల్ ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ –వికసిత్ భారత్ కి పెహచాన్" అనే నినాదంతో అనంతపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇక విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో హోంమంత్రి మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

అలాగే విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రాష్ట్ర స్థాయి ఈగల్ బృందం, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో వాకథాన్, అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ,

వాయిస్..25.. సెకన్లు

---

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన 'వాక్ థాన్'లో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ప్రభుత్వ ఆస్పత్రిలోని మాదకద్రవ్య వ్యతిరేక చికిత్స వార్డును సందర్శించారు. యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---

పల్నాడు జిల్లాలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మాచర్ల సమీపంలోని నగరవనం వద్ద ఈ తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి పొదిలి వెళ్తున్న వాహనం వేగంగా వచ్చి రోడ్డుపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. వాహనంలో మొత్తం 13 మంది ప్రయాణిస్తుండగా, నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, పలువురు గాయపడ్డారని చెప్పారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

---

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ –ఏపీఏఐఎంఎస్– –2.0 విధానం ద్వారా రైతులకు రాయితీ ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలో ఎరువులు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీకి సంబంధించిన సమస్యలు ఎదురైతే రైతులు టోల్‌ఫ్రీ నంబర్ 155251 కు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి సూచించారు.

---

నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద రొట్టెల పండుగ ఈరోజు ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. భక్తులు బారాషహీద్ దర్గాను దర్శించుకుని, అనంతరం స్వర్ణాల చెరువులో రొట్టెలను పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటున్నారు. ఈ రొట్టెల పండుగలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి ఈ రోజు పాల్గొన్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని బారాషాహీద్, కసుమూరులలోని దర్గాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేశామన్నారు.

---------------------------

అమృత్-2.0 పథకం కింద తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఈరోజు శంఖుస్థాపన చేశారు. అనంతరం పురంధేశ్వరి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కింద నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఆధునిక మురుగునీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే నగర ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో పాటు, పారిశుధ్య వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు.

---------------------------

భారతీయులు స్వాతంత్ర్య కాంక్షను, దేశభక్తి స్ఫూర్తిని ప్రజల్లో రగిలింపచేసిన వందేమాతరం గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ జయంతి ఈరోజు. 1838 జూన్ 26వ తేదీన జన్మించిన ఈ బెంగాలీ కవి... వందేమాతరం గీత రచన ద్వారా భారత ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారు. ఛటర్జీ రాసిన "ఆనంద్ మఠ్" నవల్లోని వందేమాతరం గీతం స్వతంత్ర్య సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. స్వరాజ్య సంగ్రామంలో వందేమాతర గీతంతో భారతావని మొత్తాన్ని ఏకం చేసిన బంకించంద్ర చటర్జీ, 1894వ సంవత్సరం ఏప్రిల్ 8వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలో 16 వ్యసన విముక్తి కేంద్రాలను 9.86 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం, విజయవాడ, కడప కేంద్రాలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ'లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

=====================